క్లుప్తంగా

24న మండల సమావేశం

పాలకొండ రూరల్: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 24న జరగనున్నట్టు ఎంపీడీఓ రంగారావు మంగళవారం తెలిపారు. మండల స్థాయి అధికారులు శాఖల వారీగా పూర్తి సమాచారంతో హాజరు కావాలని సూచించారు. సభ్యులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయండి

వీరఘట్టం: ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రతీ పంచాయతీలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ బి.వెంకటరమణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. పారిశుధ్య పరిరక్షణ, తాగునీటి పంపిణీపై నిత్యం పర్యవేక్షణ చేయాలన్నారు. ఇంటి పన్నుల వసూళ్లలో వేగం పెంచాలన్నారు.

బాధ్యతల స్వీకరణ

గుమ్మలక్ష్మీపురం: మండల తహసీల్దారుగా ఎన్.శేఖర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదే మండల తహసీల్దారుగా ఎన్.అప్పారావు సోమవారం బాధ్యతలు చేపట్టగా, పరిపాలన సర్దుబాటులో భాగంగా ఆయనను పాలకొండకు బదిలీ చేశారు. దీంతో ఆయన స్థానంలో డిప్యూటీ తహసీల్దారుగా పనిచేస్తున్న శేఖర్‌కు తహసీల్దారుగా పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

బాలికలు ఆత్మరక్షణ కృత్యాలు నేర్చుకోవాలి

భామిని: బాలికలు విధిగా తమను తాము రక్షించుకునేందుకు వీలుగా ఆత్మరక్షణ కృత్యాలు నేర్చుకోవాలని ట్రైనీ ఎస్‌ఐలు లోకేష్, విశ్వనాధన్, హీమామ్ హుస్సేన్ పిలుపునిచ్చారు. బత్తిలి ఏఎస్‌ఐ కొండగొర్రి కాంతారావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులం, కేజీబీవీలో బాలికలకు ఆత్మరక్షణ కృత్యాలను మంగళవారం చేసి చూపించారు. ప్రమాదాలకు గురైన అత్యవసర పరిస్థితుల్లో ఆత్మస్థైర్యం పోగొట్టుకోకుండా ఎదుర్కోవాలని వివరించారు. అనంతరం విద్యార్థినిలచే కృత్యాలు చేయించారు. మెరుగ్గా ప్రదర్శించిన వారికి ట్రైనీ ఎస్‌ఐలు బహుమతులు అందజేశారు. గురుకుల ప్రిన్సిపాల్ విజయనిర్మల, కేజీబీవీ లెక్చరర్ శారద, మహిళా పోలీసు చందన పట్నాయక్ విద్యార్థులు పాల్గొన్నారు.

వంతెన వద్ద ఇసుక తవ్వకాలపై ఫిర్యాదు

పాలకొండ రూరల్: మండలంలోని గొట్టమంగళాపురం వద్ద నాగావళి నదీ తీరంలో వంతెన దిగువ భాగంలో ఇసుక తవ్వకాలు చేస్తున్నారని సీఐటీయూ నాయకులు, గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐటీయూ నాయకుడు మజ్జి వీరన్నాయుడు నేతృత్వంలో గ్రామస్తులు అక్కడి సచివాలయ సిబ్బందికి మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ వంతెనకు 500 మీటర్ల పరిధికి దూరంగా సొంత అవసరాలకు తవ్వకాలు చేపట్టాల్సి ఉందన్నారు. ఇందుకు విరుద్ధంగా నిబంధనలకు తూట్లు పొడుస్తూ వంద మీటర్ల వద్దనే తవ్వకాలు చేస్తున్నారన్నారు. అధికారులు చొరవ తీసుకోకుంటే వంతెనకు నష్టం వస్తుందన్నారు. ఈ క్రమంలో తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన రెవెన్యూ అధికారులు నిబంధనలు సూచిస్తూ 900 మీటర్ల దూరంలో జెండాలు పాతారు. ఈ హద్దులు దాటి ఇసుక సేకరిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ఉమా సహిత కైలాస నాథ ఆలయ వార్షిక మహోత్సవాలకు సంబంధించి, రూపొందించిన వాల్‌పోస్టర్‌ను అదే ఆలయం వద్ద సర్పంచ్ బొత్తాడ శంకరరావు, ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నట్లు వారు తెలిపారు. ఆయా రోజుల్లో ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు సాయంత్రం, రాత్రి వేళల్లో సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు.

సర్వేలు వేగవంతం చేయాలి

గరుగుబిల్లి: గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న సర్వేలను వేగవంతం చేయాలని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. మండలంలోని ఉద్దవోలు గ్రామ సచివాలయాన్ని ఆమె మంగళవారం సందర్శించి, సిబ్బందికి ప్రభుత్వం అందజేసిన పరికరాలను అందజేశారు. నిర్దేశిత సమయంలోగా పీ4, వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేలను పూర్తి చేయాలని సిబ్బందిని కోరారు.



పొద్దుతిరుగుడుతో మంచి ఆదాయం

- యాజమాన్య పద్ధతులు పాటించాలి
- రసం పీల్చే పురుగులతో జాగ్రత్త
- రబీలో విత్తనం కట్టుకోవచ్చు



ఎన్.లక్ష్మీనారాయణ, సైంటిస్ట్

సీతంపేట:

ప్రస్తుత రబీ సీజన్లో ఎక్కువగా సాగవుతున్న పంటల్లో పొద్దుతిరుగుడు ఒకటి. దీనిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. జిల్లాలో దాదాపు 200 ఎకరాల వరకు ఈ పంటను సాగు చేస్తున్నట్టు అధికారుల అంచనా. పొద్దుతిరుగుడు సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి ఆదాయం పొందవచ్చని పేర్కొంటున్నారు. దీని సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త ఎస్.లక్ష్మీనారాయణ రైతులకు పలు సూచనలు చేశారు.

పొగాకు లద్దెపురుగు

ఇవి తొలిదశలో గుంపులుగా ఆకులపై పత్రహరితాన్ని గీకి తింటాయి. దీనివలన ఆకులు జల్లెడాకులుగా మారుతాయి. వీటి నివారణకు విషపు ఎరను మొక్కల మొదళ్ల దగ్గర సాయంత్రం సమయంలో వేసుకోవాలి. లేదా 0.5 మి.లీ. స్పైనోసాడ్‌ను ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

బీహారి గొంగళి పురుగు

తల్లిపురుగు ఆకులపై గుడ్లను గుంపులుగా పెడుతుంది. లార్వాల శరీరం లేత పసుపు రంగుతో ఉండి ముదురు పసుపు రంగు వెంట్రుకలతో కప్పబడి ఉంటుంది. ఈ లార్వాలు ఆకుల్ని తిని తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయి. పురుగులు ఉధృతంగా ఆశిస్తే మొక్కలు మోడు బారతాయి. గుడ్లు మరియు తొలి దశ గొంగలి పురుగులు గుంపులుగా ఆకుల మీద ఉన్నపుడు ఏరి నాశనం చేయాలి. వేప గింజల ద్రావణాన్ని (5 శాతం) పిచికారీ చేయాలి. పెద్ద లార్వాలు ఉంటే ఎండోసల్ఫాన్ లేదా క్లోరిఫైరీపాస్ 2 మి.లీ లేదా డైక్లోరావాస్ ఒక మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

శనగపచ్చ పురుగు

పొద్దు తిరుగుడు పండించే అన్ని ప్రాంతాల్లో ఈ పరుగు ఆశిస్తుంది. దీని లార్వాలు పువ్వులు, గింజల మధ్య చేరి వాటిని తింటూ అధిక నష్టాన్ని కలుగజేస్తాయి. ఎండోసల్ఫాన్ లేదా క్వినాల్ ఫాస్, క్లోరిఫైరీపాస్ 2 మి.లీ లీటరు నీటికి పిచికారీ చేయాలి.

రసం పీల్చే పురుగులు

దీపపు పురుగులు ఆశించిన ఆకుల చివర్లు పసుపు పచ్చగా మారి క్రమేపి ఆకు అంతా ఎర్రబడి చివరగా ఆకులు ముడుచుకుని దొనెలలాగా కనిపిస్తాయి. వీటి నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా డైమిథోయేట్ లీటరు నీటికి 2 మి.లీ కలిపి ఆకుల అడుగు భాగం తడిసేలా పిచికారీ చేయాలి. తెల్లదోమ ఆకుల అడుగుభాగం నుంచి రసాన్ని పీల్చడం వలన ఆకులు పసుపు రంగుకు మారి మొక్కలు కూడా గిడసబారి ఎండిపోతాయి. వీటి నివారణకు ట్రైజోఫాస్ 2.5 మి.లీ లేదా ఎసిఫేట్ 1 గ్రాము లీటరు నీటికి పిచికారీ చేయాలి. వాతావరణంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నపుడు పైరు బెట్టకు గురైనపుడు వీటి ఉధృతి ఎక్కువగా ఉంటుంది.

పక్షుల బెడద

ఈ పంటకు ముఖ్యంగా రామచిలుకల బెడద ఎక్కువ. వీటి నివారణకు పైరును పెద్దకమతాలలో వేయాలి. మెరుపు రిబ్బనులను పైరుపైన అడుగు ఎత్తున సూర్యరశ్మి రిబ్బనుపై పడేటట్టు ఉత్తర, దక్షిణ దిశగా కట్టాలి. శబ్దం చేయడం వలన గాని దిష్టి బొమ్మలను ఉపయోగించి కాని పక్షులను పారద్రోలాలి.

పైరుకోత

పువ్వు వెనుక భాగం నిమ్మ పచ్చ రంగుకి మారిన తర్వాత పువ్వులను కోసి వాటిని 2–3 రోజుల పాటు ఆరనివ్వాలి. కర్రలతో కొట్టగాని, వలిచిగాని విత్తనాన్ని వేరు చేయాలి. విద్యుత్ ద్వారా నడిచే నూర్పిడి యంత్రాలను ఉపయోగించి విత్తనాన్ని వేరు చేసుకోవచ్చు. గింజలలో తేమ 9–10 శాతం వచ్చే వరకు ఎండబెట్టాలి.

విత్తనోత్పత్తి

పొద్దు తిరుగుడులో హైబ్రీడ్ విత్తనోత్పత్తి చేపట్టేందుకు రబీ కాలం అనువైనది. విత్తనోత్పత్తి చేపట్టేందుకు సుమారు వెయ్యి మీటర్ల వరకు ఎలాంటి పొద్దు తిరుగుడు పంట లేని నీటి సదుపాయం గల సారవంతమైన పొలాన్ని ఎన్నుకోవాలి. హైబ్రీడ్ విత్తనోత్పత్తి చేసేటపుడు ఆడ, మగ వరుసలకు 3:1 నిష్పత్తిలో నాటుకోవాలి. పొలం చుట్టూ రెండు వరుసల మగ విత్తనాన్ని నాటుకోవాలి. పంట కాలంలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. ఆడ మొక్కలలో పుప్పొడి వెదజల్లే మొక్కలను గుర్తించి తీసివేయాలి. పూత దశలో ఉదయం పూట మగ మొక్కల పువ్వుల నుంచి పుప్పొడిని మొత్తటి గుడ్డతో రుద్ది అదే గుడ్డను తర్వాత ఆడ మొక్కల పువ్వులపై రుద్దాలి. దీని ద్వారా ఫలదీకరణం చెంది ఎక్కువ గింజ కట్టడానికి అవకాశం ఉంది. పొలం దగ్గర తేనెటీగలు పెంచడం ద్వారా కూడా గింజ కట్టే శాతాన్ని పెంచవచ్చు. కోత సమయంలో ఆడ, మగ పువ్వులను వేరుచేయాలి. ఆడ మొక్కల నుంచి వచ్చిన విత్తనం హైబ్రీడ్ విత్తనం.

పాఠశాల ప్రహరీ నిర్మాణానికి చర్యలు

పాలకొండ: స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణానికి పట్టణానికి చెందిన పల్లా కొండలరావు ముందుకు వచ్చారు. పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ పాఠశాల ప్రహరీ కొద్ది రోజుల కిందట కూలిపోయింది. సమారుగా 350 మంది విద్యార్థినిలు ఉన్న ఈ పాఠశాల గోడ కూలిపోవడంతో విద్యార్థినిలు ఇబ్బందులు పడుతున్నారు. ఆకతాయిల పాఠశాల ఆవరణలో మందు తాగడం, విద్యార్థినిలను అల్లర చేయడం వంటి చేష్టలు చేస్తున్నారు. దీనిపై పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి ప్రహరీ నిర్మాణం కోసం ఉన్నతాధికారులకు నివేదించారు. నిధులు మంజూరు కాలేదు. దీంతో నగర పంచాయతీ అభివృద్ధి కమిటీ చైర్మన్, షిర్డీసాయి మందిర నిర్వాహకులు పల్లా కొండలరావును కలసి పరిస్థితి వివరించారు. దీనిపై స్పందించిన ఆయన ప్రహరీ నిర్మాణానికి అవసమైన ఖర్చు తానే భరిస్తానని ముందుకు వచ్చారు. పనులు చేపట్టాలని తన సోదరుడైన నగర పంచాయతీ చైర్మన్ పల్లా ప్రతాప్‌కు తెలియజేయడంతో ఆయన మంగళవారం ప్రహరీ నిర్మాణం పనులు చేపట్టారు. పల్లా కొండలరావు పాఠశాల ప్రహరీ నిర్మాణానికి ముందుకు రావడంపై హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులతో పాటు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రహరీ నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్న పల్లా ప్రతాప్

శక్తి యాప్‌పై అవగాహన



శక్తి యాప్ వినియోగంపై పాలకొండ శక్తి యాప్ టీం సభ్యులు మంగళవారం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో అవగాహన కల్పించారు. ఈ యాప్ ద్వారా 11 రకాల సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ టీంలో ఒక ఏఎస్‌ఐ, ఇద్దరు హెచ్‌సీలు, ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు అందుబాటులో ఉంటారని వివరించారు. 100, 112 నంబర్లతో పాటు గివ్ ఏ కంపార్ట్, మిస్సింగ్ చిల్డ్రన్స్, సేఫ్ ట్రావెల్, నైట్ షెల్టర్, వాట్సాప్ గవర్నెన్స్, పోలీసు కాంటాక్ట్, నియర్‌బై పోలీస్‌స్టేషన్ తదితర సేవలు పొందేందుకు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. – పాలకొండ

జీడి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

పాలకొండ రూరల్: జీడి పంటకు సంబంధించి క్వింటాకు రూ.20వేలు గిట్టుబాటు ధర ప్రభుత్వమే చెల్లించి కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం నాయకుడు ద్వారపూడి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. పాలకొండ మండలం జంపరకోట సచివాలయం వద్ద అక్కడి రైతులతో కలిసి మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాపారులు, దళారులు రైతులను మోసం చేసి పంటను తక్కువ ధరకు దోచుకుంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నేరుగా కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయాలన్నారు. తద్వారా నేరుగా పంటకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. జీడి ప్రాసెసింగ్ యూనిట్లు సదరు పంటలు పండిస్తున్న మండలాల వారీగా ఏర్పాటు చేయాలని, ఉపాధి కల్పించాలన్నారు. ఆందోళనలో రైతులు వేణు భీమలింగం, లక్ష్మణరావు, కొండగొర్రె పద్మ, అప్పలనరసమ్మ, మోహనరావు, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

అనుమతులు తప్పనిసరి

గుమ్మలక్ష్మీపురం: గ్రామీణ ప్రాంతాల్లో భవన నిర్మాణాలు చేపట్టే వారంతా పంచాయతీ అనుమతులు తప్పనిసరిగా పొందేలా గ్రామస్తులకు అవగాహన కల్పించాలని జిల్లా టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారిణి జి.నాగలత అన్నారు. ఇదే విషయమై ఆమె.. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశమయ్యా రు. గ్రామాల్లో ఏ విధమైన భవనాలు నిర్మించినా పంచాయతీల అనుమతి తీసుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తూ చేస్తున్న నిర్మాణాలను గుర్తించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో ఎస్.సాల్మన్ రాజు, ఈవోపీఆర్‌డీ ధర్మారావు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శులకు సూచనలిస్తున్న జిల్లా టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారిణి నాగలత

రబీలో తొలి విడత ఎరువులు వేయాలి

భామిని: రబీ వరి నాట్లు వేసి నెల రోజులు దాటుతున్నదున తొలి విడత ఎరువులు విధిగా వేయాలని ఏఓ కె.సింహాచలం రైతులకు సూచించారు. మండలంలోని బత్తిలి, కాట్రగడ బీలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మంగళవారం పాల్గొన్నారు. రైతులకు పలు సూచనలు చేశారు. తొలి విడతలో 30 కిలోల పొటాష్‌తో పాటు 15 కిలోల యూరియా కలిపి వేయాలన్నారు. సస్యరక్షణ చర్యలు చేపట్టి చీడపీడలు సోకితే క్రిమి సంహారక మందులు కొట్టాలన్నారు. వ్యవసాయ సహాయకులు దినేష్, నాగరాజు, ఈశ్వర్ పలువురు రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ

ప్రకృతి వ్యవసాయ విధానాలతో మేలు

గుమ్మలక్ష్మీపురం: పంటల సాగులో ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబిస్తే మేలు జరుగుతుందని కురుపాం ఏడీఏ ఎ.నిర్మల జ్యోతి తెలిపారు. మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ, జేకే పాడు గ్రామంలో మండల వ్యవసాయాధికారి సీహెచ్ ప్రసాద్, ఏపీ సీఎన్‌ఎఫ్‌ల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రకృతి సాగు పద్ధతులు పాటిస్తూ పంటలు పండిస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, ఆరోగ్యవంతమైన పంటలు చేతికి వస్తాయన్నారు. 50 శాతం సబ్సిడీపై రైతులకు పవర్ వీడర్లు, పవర్ టిల్లర్లు, రోటో వీడర్లు అందిస్తున్నట్లు వెల్లడించారు. నిమ్మగడ్డి సాగుకు ప్రోత్సాహం అందించనున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీసీఎన్‌ఎఫ్ మండల కో–ఆర్డినేటర్ గణేష్, యూనిట్ ఇన్‌చార్జ్ కిమిడి భూషణ్ తదితరులు ఉన్నారు.

పరామర్శ



ఆంజనేయులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి తదితరులు

వీరఘట్టం: వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం వీరఘట్టం మండల కన్వీనర్ కెంగువ ఆంజనేయులను మంగళవారం మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పరామర్శించారు. ఇటీవల ఈయనకు ఓ ప్రమాదంలో కాలు విరిగిపోయింది. విషయం తెలియడంతో మాజీ ఎమ్మెల్యే కళావతి ఆంజనేయులను వీరఘట్టంలోని ఆయన స్వగృహంలో పరామర్శించారు. ఆమెతో సర్పంచ్ మిడితాన కల్యాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

దరఖాస్తు చేసుకోండి

గరుగుబిల్లి: రాయితీపై వ్యవసాయ పరికరాలు కావాల్సిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఏవో విజయభారతి ఓ ప్రకటనలో మంగళవారం కోరారు. 50 శాతం రాయితీపై ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, రోటో వీడర్లు, పవర్ వీడర్లు, స్ప్రేయర్లు వంటివి అందించడం జరుగుతుందన్నారు.

పేరు మార్చి ఏం సాధిస్తారు..!



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

- మాజీ ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: ఎన్నికల వేళ కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయలేని వారు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అమలు చేసిన దిశా యాప్ పేరు మార్చి శక్తి యాప్‌గా ప్రజల్లోకి తెచ్చి ఏం సాధిస్తారన్నారు. మంగళవారం వీరఘట్టం వచ్చి ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. మహిళల రక్షణ కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన దిశా యాప్‌కు శక్తి యాప్‌గా పేరు మార్చి కూటమి ప్రభుత్వం కాపీ కొట్టిందన్నారు. అప్పట్లో దిశా యాప్‌పై ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, హోం మంత్రి అనిత నానా రాద్ధాంతం చేసి నేడు ఆ పథకాన్నే పేరు మార్చి నడుపుతున్నారని ఎద్దేవా చేశారు. భూముల రీసర్వేపై కూడా కూటమి నాయకులు గతంలో తప్పుడు ప్రచారాలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించారన్నారు. తోటపల్లి విషయంలో రైతులను రైతులను దగా చేసిందన్నారు. తక్షణమే తోటపల్లి పాత ఆయకట్టు ఆధునికీకరణ పనులు ప్రారంభించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఆమెతో ఎంపీటీసీ మంతిని హేమలత, వండవ సర్పంచ్ మిడితాన కల్యాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు భోగి మణి, బూరాడ చిన్న, పిన్నింటి శ్రీను, శంభాన శ్రీను, అంబళ్ల రవి, గెంబలి మహేష్ ఉన్నారు.

రేషన్ పంపిణీ ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలం, పి.లేవిడి గ్రామంలో ఎట్టకేలకు రేషన్ సరుకుల పంపిణీ ప్రారంభమైంది. గ్రామంలోని లబ్ధిదారులకు రేషన్ పంపిణీలో అలసత్వం వహిస్తున్న నేపథ్యంలో 'రేషన్ పంపిణీ ఎప్పుడో' శీర్షిక పేరిట ఈ నెల 18వ తేదీన సాక్షి దినపత్రికలో వార్త ప్రచురించడం జరిగింది. ఈ మేరకు స్పందించిన సంబంధిత అధికారులు.. మంగళవారం ఉదయం గ్రామస్తులకు రేషన్ సరుకులు ఇప్పించారు. రేషన్ ఎందుకు ఇంతవరకు పంపిణీ జరగలేదన్న విషయంపై సేల్స్‌మన్ రవికుమార్ మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం మండలం, గుల్లలంక గ్రామంలో చింతపండు కొనుగోళ్ల బాధ్యతలను జీసీసీ అధికారులు అప్పగించడంతో అక్కడికి వెళ్లాల్సి వచ్చిందని, దాంతో రేషన్ ఇవ్వడం ఆలస్యమైందని చెప్పుకొచ్చారు.



రేషన్ సరుకుల కోసం క్యూలైన్‌లో లబ్ధిదారులు

రజకుల ఆందోళన

పాలకొండ: మండలంలోని లోగిడి లక్ష్మీపురం గ్రామంలో జరిగిన సంఘటనపై రజక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన నిర్వహించారు. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం వద్ద రజక సంఘాల నేతలు సమావేశం నిర్వహించి తమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ సందర్భంగా ఆ సంఘం పెదారపు భాస్కరరావు మాట్లాడుతూ రేజేటి శేఖర్ తనకు డబ్బులు బాకీ ఉన్న వారికి ఇంటికి వెళ్లి అడగ్గా వారు శేఖర్‌ను విద్యుత్ స్తంభానికి కొట్టి కొట్టారని ఆరోపించారు. టౌన్ షిప్ పేరిట రూ.లక్షలు వసూలు చేశారని దీన్ని ప్రశ్నించిన వారిపై దాడి చేయడం ఎంత వరకు సమంజమన్నారు. దీనిపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశామని, నిందితులను కఠినంగా శిక్షించి బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



ఆందోళన చేస్తున్న రజక సంఘాల నాయకులు

ఉపాధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించండి

పాలకొండ రూరల్: ఉపాధి పనుల్లో లోపాలు లేకుండా సక్రమంగా క్షేత్ర స్థాయి సిబ్బంది చూడాలని ఎంపీడీఓ రంగారావు అన్నారు. మండలంలోని అంపిలి గ్రామంలో జరుగుతున్న ఉపాధి చానల్ పనులను ఆయన మంగళవారం. ఈ క్రమంలో అక్కడి రైతులకు నీటి కుంటల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఆసక్తి గల రైతులు నిర్దేశిత భూమి, దరఖాస్తు చేస్తే ఉపాధి పనుల ద్వారా కుంటలు తవ్విస్తామన్నారు. వేసవి నేపథ్యంలో వేతనదారులు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. అనంతరం సింగన్నవలసలో గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం పెంచిన వ్యయంపై అవగాహన కల్పించారు. గ్రామ స్థాయిలో నీటి వనరుల పర్యవేక్షణ, చేతిబోర్లు, రక్షిత పథకాలపై సచివాలయ సిబ్బంది దృష్టి పెట్టాలన్నారు.



అంపిలిలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

త్వరగా కోలుకోవాలి..

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని శివన్నపేట, కాటందొరవలస గ్రామాల్లో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఎర్రంశెట్టి రేవతి, బిడ్డిక వెంకటరమణలను మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి మంగళవారం సాయంత్రం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆమె వెంట కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లె సుజాత తదితరులు ఉన్నారు.



వెంకటరమణను పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి

సారా రహిత గ్రామాలే లక్ష్యం



సారా రహిత గ్రామాలే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఎస్‌ఐ సీహెచ్ రాజేశ్వరి అన్నారు. నవోదయం 2.0 పేరిట గుమ్మలక్ష్మీపురం మండలం, ఎస్.కోటపాడు, జేకే పాడు గ్రామాల్లో సారా నిర్మూలనపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. సారా నిర్మూలిద్దాం.. గ్రామాన్ని ప్రగతిబాట పట్టిద్దామని ఆమె పిలుపునిచ్చారు. సారా తయారీ, రవాణా నేరమని, ఎక్కడైనా సారా విక్రయాలు జరిగితే సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సమాజంలో సారా అనే పెనుభూతం లేకుండా చేసేందుకు గ్రామస్తులంతా సహకరించాలని కోరారు.

–గుమ్మలక్ష్మీపురం